క్లుప్తంగా

అలరించిన కదంబ



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్‌ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మంగళవారం కదంబ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర సీనియర్‌ సిటిజన్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ మహిళా విభాగం ఆధ్వర్యంలో జరగ్గా, పాలక మండలి ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి వూటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. సింహాచల శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి దేవాలయ విశిష్టతలు, క్షేత్ర చారిత్రక, మత సంబంధమైన వివరాలను సభకు అధ్యక్షత వహించిన డాక్టర్‌ వి.నాగరాజ్యలక్ష్మి వివరించారు. ప్రసిద్ధ కవి దాశరథి జయంతి సందర్భంగా ఆయన కవితావైభవాన్ని డాక్టర్‌ మైలవరపు లలితకుమారి తెలిపారు. అనంతరం చిన్నారులు భక్తిగీతాలను ఆలపించగా, డాక్టర్‌ మాధవపెద్ది విజయలక్ష్మి పాల్గొన్నారు.

సమాజంలో వైద్యుల పాత్ర కీలకం



గుంటూరు ఎడ్యుకేషన్‌: సమాజంలో వైద్యుల పాత్ర ఎంతో కీలకమని కెనడీ నెక్స్ట్‌జెన్‌ కిడ్స్‌ స్కూల్‌ డైరెక్టర్‌ కె.శ్రీకాంత్‌బాబు, డాక్టర్‌ కె.శ్రీవిద్య పేర్కొన్నారు. మంగళవారం డాక్టర్స్‌ డే సందర్భంగా రాజేంద్రనగర్‌లోని కెనడీ నెక్స్ట్‌ జెన్‌ కిడ్స్‌ పాఠశాల విద్యార్థులు ఆస్టర్‌ రమేష్‌ హాస్పిటల్‌ను సందర్శించి, వైద్యుల విధులను పరిశీలించారు. ఈసందర్భంగా చిన్నారులతో ముచ్చటించిన వైద్య నిపుణులు ఆరోగ్యకరమైన జీవితాన్ని గడిపేందుకు అవసరమైన చిట్కాలను తెలియజేశారు. ఆస్పత్రి ఎండీ డాక్టర్‌ మమత చిన్నారులతో మాట్లాడారు. ఈసందర్భంగా చిన్నారులు వైద్యుల మాదిరిగా తెల్లకోటు, స్టెతస్కోప్‌ ధరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్‌ పీఎల్‌ హేమలత పాల్గొన్నారు.

ప్రాణాలను లెక్కచేయకుండా వైద్య సేవలు



గుంటూరు ఎడ్యుకేషన్‌: ప్రాణాంతక వ్యాధులు ప్రబలిన అత్యవసర పరిస్థితుల్లోనూ తమ ప్రాణాలను లెక్కచేయకుండా వైద్య సేవలు అందించిన వైద్యులు ఆదర్శనీయులని డాక్టర్‌ కేఎల్‌పీ పబ్లిక్‌ స్కూల్‌ కరస్పాండెంట్‌ డాక్టర్‌ కె.కృష్ణప్రసాద్‌ పేర్కొన్నారు. మంగళవారం జేకేసీ కళాశాలరోడ్డులోని డాక్టర్‌ కేఎల్‌పీ పబ్లిక్‌ స్కూల్లో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కృష్ణప్రసాద్‌ మాట్లాడారు. దేశ సేవలు వైద్యులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని, అనేక వైరస్‌లకు వ్యాక్సిన్లు సైతం కనుగొన్నారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్‌ జి.రత్తయ్య, ఏఓ కె. వెంకట్రావు, అకడమిక్‌ కో–ఆర్డినేటర్‌ బి.శైలజ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



గుంటూరు ఎడ్యుకేషన్‌: విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని యువజన సర్వీసుల శాఖ సీఈఓ ఆర్‌.చంద్రముని పేర్కొన్నారు. సాంబశివపేటలోని ఏసీ కళాశాలలో మంగళవారం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత స్పోకెన్‌ ఇంగ్లిష్‌ తరగతులను పరిశీలించారు. కిట్స్‌ ఇంజినీరింగ్‌ కళాశాల ఆంగ్ల అధ్యాపకుడు నూతలపాటి అరవింద్‌ మాట్లాడుతూ ఉద్యోగ సాధనలో ఆంగ్ల భాష ప్రముఖ ప్రాత పోషిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో యువజన సర్వీసుల శాఖ మేనేజర్‌ బి.రాధిక పాల్గొన్నారు.

ముళ్లపూడి చిరస్మరణీయుడు

లక్ష్మీపురం: తెలుగు సాహితీ రంగంలో ఎన్నో సజీవ పాత్రలు సృష్టించి ఓ చెరగని ముద్ర వేసిన ముళ్లపూడి వెంకట రమణ చిరస్మరణీయులని అవగాహన హాస్య వల్లరి బృంద సభ్యులు నివాళులర్పించారు. గుంటూరు అరండల్‌ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ప్రముఖ హాస్య, సినీ రచయిత ముళ్లపూడి వెంకటరమణ జయంతి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు వీవీ రామ్‌ కుమార్‌ మాట్లాడుతూ సున్నిత హాస్యం, సునిశిత వ్యంగ్యం ముళ్లపూడి వెంకట రమణ సొంతమని చెప్పారు. హాస్య ప్రియులు ఆర్‌.వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో హాస్య ప్రియులు గుప్త, మూర్తి, రాజశేఖర్‌ పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెపై ఉక్కుపాదం

- ఎలక్ట్రికల్‌ అవుట్‌ సోర్సింగ్‌ కార్మికులకు నోటీసులు
- 24 గంటల్లో విధులకు హాజరుకావాలని అధికారుల ఆదేశం
- బెదిరింపులతో విధులకు హాజరవుతున్న సిబ్బంది



నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న యూనియన్‌ నాయకులు(ఫైల్‌)

నెహ్రూనగర్‌: న్యాయమైన డిమాండ్లను పరిష్కారించాలని కోరుతూ మున్సిపల్‌ ఇంజినీరింగ్‌ అవుట్‌ సోర్సింగ్‌ కార్మికులు సమ్మెపై ఉక్కుపాదం మోపారు. అధికారుల బెదిరింపు ధోరణితో దారిలో తెచ్చుకుంటున్నారు. దీంతో కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం తాత్కాలికంగా నిలిచిపోయింది. అవుట్‌ సోర్సింగ్‌ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ది ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర మున్సిపల్‌ ఇంజినీరింగ్‌, టౌన్‌ ప్లానింగ్‌, అండ్‌ శానిటేషన్‌ వర్కర్స్‌ ట్రేడ్‌ యూనియన్‌ ఆధ్వర్యంలో గత నెల 22వ తేదీ నుంచి సమ్మె బాట పట్టారు. సమ్మె చేస్తుపాకప ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో గత నెల 27వ తేదీన సీడీఎంఏ కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపట్టారు. 28వ తేదీ సాయంత్రంలోగా చర్చలకు పిలవకపోగా సాయంత్రం నుంచి వీధి లైట్లు వెలగించమని స్పష్టం చేశారు. ఎలక్ట్రికల్‌ విభాగం సిబ్బంది విధులకు హాజరు కాకుండా గైర్హజరయ్యారు. దీంతో గత మూడు రోజుల నుంచి నగరంలో వీధి లైట్లు వెలగించకపోవడంతో నగరం అంధకారంలోకి వెళ్లింది. దీనిపై 30వ తేదీన జరిగిన కౌన్సిల్‌ సమావేశంలో వీధి దీపాల సమస్యలపై ప్రజాప్రతినిధులు మండిపడటంతో నగర కమిషనర్‌ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్‌ అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. సమ్మెలో పాల్గొన్న వారికి నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు.

అధికారుల బెదిరింపులతో..

మూడు రోజులుగా నగరంలో వీధి లైట్లు వెలగించకపోవడంపై నగరం అంధకారం నెలకొంది. దీంతో నగర మేయర్‌ కోవెలమూడి రవీంద్ర సమ్మె చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సూచించడంతో పాటు కమిషనర్‌ పులి శ్రీనివాసులు మంగళవారం నుంచి ఇంజినీరింగ్‌ ఎలక్ట్రిక్‌ విభాగంలో పనిచేస్తున్న 63 మంది కార్మికులకు నోటీసులు జారీ చేశారు. జూలై ఒకటో తేదీ సాయంత్రం 5 గంటల లోపు విధుల్లోకి హాజరుకాకపోతే విధుల నుంచి తొలగించబడతారని షోకాజ్‌ నోటీసులు జారీ చేశారు. దీంతో దిక్కు తోచని స్థితిలో ఎలక్ట్రిక్‌ విభాగంలో పనిచేస్తున్న కార్మికులు సమ్మె విరమించుకుని మంగళవారం సాయంత్రం నుంచి విధుల్లో చేరారు.

కార్మికుల ప్రధాన డిమాండ్లు ఇవే...

- జీఓ నంబర్‌ 36 ప్రకారం రూ.21,000–రూ.24,500 జీతాలు చెల్లించాలి
- మున్సిపల్‌ అవుట్‌ సోర్సింగ్‌ ఉద్యోగులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి
- రిటైర్‌మెంట్‌, చనిపోయినా, అనారోగ్యం పాలైన వారి స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలి.
- ఆప్కాస్‌ రద్దు చేస్తే ఉద్యోగాలు పర్మినెంట్‌ చేయాలి
- సుప్రీం కోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం, గ్రాడ్యూటీ అమలు చేయాలి
- చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలి
- 2023 డిసెంబర్‌లో జరిగిన 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలి
- రిటైర్‌మెంట్‌ అయిన కార్మికులకు రూ.75 వేలు, పది సంవత్సరాలు సర్వీస్‌ దాటిన వారికి సంవత్సరానికి రూ.2 వేలు చొప్పున ఇస్తామన్న హామీ అమలు చేయాలి
- ప్రమాద మరణానికి ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల పెంచాలి
- దహణ సంస్కారానికి ఖర్చులు రూ.15,000 నుంచి రూ.20,000కు పెంచాలి

విధుల నుంచి తొలగిస్తామన్నారు



తొమ్మిది రోజులుగా ఇంజినీరింగ్‌ కార్మికుల నిరసన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం కమిషనర్‌ పిలిపించారు. అప్పుడే మున్సిపల్‌ శాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ సురేష్‌ కుమార్‌ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని నగరపాలక సంస్థ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్‌ నిర్వహించారు. సమస్య సీఎం దృష్టికి వెళ్లిందని.. సమస్యకు పరిష్కారమవుతుందని, అంత వరకు విధులకు హాజరు కావాలని లేని పక్షంలో అవుట్‌ సోర్సింగ్‌ విధుల నుంచి తొలగించాలని కమిషనర్‌కు ప్రిన్సిపల్‌ సెక్రటరీ ఆదేశించడంతో చేసేదేమి లేక సమ్మె విరమించాం.

– ఈ.మధుబాబు, యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షుడు

నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

కొరిటెపాడు(గుంటూరు): విద్యుత్‌ మరమ్మతుల దృష్ట్యా బుధవారం సరఫరా నిలిపివేయనున్నట్లు టీ–4 డీఈఈ పీహెచ్‌ ఖాన్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు. 11 కేవీ మారుతీనగర్‌ ఫీడర్‌ పరిధిలోని వినోబా నగర్‌, జెండా చెట్టు ఏరియా, జాకీర్‌ హుస్సేన్‌ నగర్‌, ఎల్బీనగర్‌, క్రిస్టియన్‌ పేట, మారుతీ నగర్‌, కొండయ్య కాలనీ తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

హెల్త్‌ సెక్రటరీల కౌన్సెలింగ్‌ పారదర్శకంగా నిర్వహించాలి



లక్ష్మీపురం: హెల్త్‌ సెక్రటరీల కౌన్సెలింగ్‌ పారదర్శంగా నిర్వహించాలని యునైటెడ్‌ విలేజ్‌, వార్డు హెల్త్‌ సెక్రటరీ యూనియన్‌(సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు వై.నేతాజీ పేర్కొన్నారు. గుంటూరులోని జిల్లా డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ జాబితాలో తప్పులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. హెల్త్‌ సెక్రటరీల జీవితాలతో ఆడుకోవద్దు చెప్పారు. యునైటెడ్‌ విలేజ్‌ వార్డ్‌ హెల్త్‌ సెక్రెటరీస్‌ యూనియన్‌కు ఇచ్చిన హామీ మేరకు కౌన్సెలింగ్‌ జరపకపోతే భవిష్యత్తులో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

సమాజం రుణం తీర్చుకోవాలి

కలెక్టర్‌ ఎస్‌.నాగలక్ష్మి



బాధితురాలు రాధికతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్‌ ఎస్‌.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్‌: మన ఎదుగుదలలో ఎంతో కీలక భూమిక పోషించే సమాజంపై మనం ఎప్పుడూ కృతజ్ఞతా భావంతో ఉండాలని జిల్లా కలెక్టర్‌ ఎస్‌.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ జీవనాధారానికి ఉపయోగపడే టిఫిన్‌ బండిని జీజీహెచ్‌ ఎదుట నుంచి తొలగించారని తనకు మళ్లీ టిఫిన్‌ బండి పెట్టుకునేందుకు అవకాశం కల్పించాలని స్థానిక వెంకట్రావు పేటకు చెందిన రాధిక కుమారుడు యశ్వంత్‌ జిల్లా కలెక్టర్‌ వినతిపత్రం అందజేశాడు. బాలుడు మీడియాలో మాట్లాడిన మాటలు వైరల్‌గా మారాయి. దీంతో గివింగ్‌ బ్యాక్‌ టు సొసైటీ సంస్థ ప్రతినిధులు బాలుడు తల్లి రాధికకు టిఫిన్‌ బండిని ఉచితంగా అందించారు. ఈ బండిని మంగళవారం సాయంత్రం కలెక్టర్‌ చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పీజీఆర్‌ఎస్‌ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించాలి



విద్యార్థులతో ఆచార్య రవికుమార్‌, ఎస్వీ రమణ, మణికంఠేశ్వర్‌, లలిత తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్‌: ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా విద్యలో నాణ్యతకు పెద్దపీట వేయవచ్చునని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ సీడీసీ డీన్‌ ఆచార్య వి.రవికుమార్‌ పేర్కొన్నారు. మంగళవారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఏఎన్‌యూ ఇటీవల ప్రకటించిన ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్‌ మేనేజ్‌మెంట్‌ తృతీయ సెమిస్టర్‌ ఫలితాల్లో అత్యధిక ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎస్‌బీఐ ముత్యాలరెడ్డినగర్‌ బ్రాంచి మేనేజర్‌ మణికంఠేశ్వర్‌ మాట్లాడుతూ భావితరం మేనేజర్లు వ్యాపారానికి సంబంధించిన మెలకువలను, మార్కెట్‌ వ్యూహాలను క్షుణ్ణంగా తెలుసుకునేందుకు పఠనాసక్తి తప్పనిసరిగా పెంచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఎస్వీ రమణ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల పరీక్షా విభాగాధిపతి చిగురుపాటి వేదవతి, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్‌ వి. చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్‌ డాక్టర్‌ కె.లలిత, సహాయాచార్యులు సీహెచ్‌ వైష్ణవి, ఏ.బాజీబాబు, అభిలాష్‌, అనిత, రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

వైద్యులు దైవంతో సమానం



కేక్‌ కట్‌ చేస్తున్న డేగల ప్రభాకర్‌, పక్కన వైద్యులు

గుంటూరు మెడికల్‌: ప్రాణం పోసే వైద్యుడు దైవంతో సమానమని ఆంధ్ర ప్రైమ్‌ హాస్పిటల్‌ చైర్మన్‌ డేగల ప్రభాకర్‌ అన్నారు. వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నాజ్‌ సెంటర్లోని ఆంధ్ర ప్రైమ్‌ హాస్పిటల్‌లో వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హాస్పిటల్‌ చైర్మన్‌ డేగల ప్రభాకర్‌ వైద్యులతో కలిసి కేకును కట్‌ చేసి వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్‌ వైద్యులు అచ్చంశెట్టి అన్వేష్‌,కాసుల సాయి రాజశేఖర్‌, జల్లేపల్లి తేజస్వి, చెరుకూరి జగదీష్‌, బడుగు పవన్‌ కుమార్‌, అందె కోటి వెంకటేశ్వరరావు, మాధవి లత, ఊటుకూరి గోపి, కె.సునీల్‌ పాల్గొన్నారు.

డాక్టర్‌ బీసీ రామ్‌ని ఆదర్శంగా తీసుకోవాలి

లక్ష్మీపురం: వైద్య వృత్తిలో ప్రజలకు విశేష సేవలందించి దేశంలోని వైద్యులందరికీ డాక్టర్‌ బి.సి.రామ్‌ ఆదర్శంగా నిలిచారని సీనియర్‌ వైద్యులు డాక్టర్‌ కె.సురేష్‌ కుమార్‌ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

అహల్య హాస్పిటల్‌లో డాక్టర్స్‌ డే వేడుకలు

గుంటూరు మెడికల్‌: డాక్టర్స్‌ డే సందర్భంగా మంగళవారం గుంటూరు కొత్తపేటలోని అహల్య హాస్పిటల్‌లో కేక్‌ కటింగ్‌ చేసి వైద్యులను ఘనంగా సత్కరించారు. డాక్టర్‌ శనక్కాయల ఉమాశంకర్‌ మాట్లాడుతూ రోగుల ప్రాణాలు కాపాడుతున్న వైద్యుల సేవలు ఎనలేనివని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్‌ శనక్కాయల గౌరీ శంకర్‌, డాక్టర్‌ రాజకుమారి, డాక్టర్‌ శిరీష, డాక్టర్‌ ప్రియాంక, డాక్టర్‌ కరీం పాల్గొన్నారు.

డాక్టర్‌ కోటేశ్వరరావుకు సన్మానం

లక్ష్మీపురం: సెంట్రల్‌ జీఎస్టీ పెన్షనర్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవం మంగళవారం నిర్వహించారు. నగరంపాలెంలోని సి.జి.హెచ్‌.ఎస్‌ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సీజీహెచ్‌ఎస్‌ చీఫ్‌ మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ టి.సి.హెచ్‌.కోటేశ్వరరావును జీఎస్టీ పెన్షనర్ల సంఘం మంగళవారం ఘనంగా సన్మానించింది. పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు టి.వివేకానంద, లోకల్‌ అడ్వైజరీ కమిటీ మెంబర్‌ గుమ్మడి సీతారామయ్య చౌదరి, కోశాధికారి పి.కోటేశ్వరరావు మాట్లాడారు.

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభించాలి

గుంటూరు ఎడ్యుకేషన్‌: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలను తక్షణమే ప్రారంభించాలని ఏబీవీపీ గుంటూరు జిల్లా సంఘటన కార్యదర్శి గురువెల్లి సాయి కోరారు. మంగళవారం ఏసీ కళాశాల కూడలిలోని కళాశాల విద్య ఆర్జేడీ కార్యాలయంలో ఆర్జేడీ కళావతికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా సాయి మాట్లాడుతూ ఇంటర్‌ పరీక్షలు ముగిసి మూడు నెలలైనా డిగ్రీలో ప్రవేశాలపై ప్రభుత్వం ఒక నిర్దిష్టమైన విధానాన్ని ప్రకటించలేదని, సింగిల్‌, డ్యూయల్‌ మేజర్‌ అనే విషయమై కనీస స్పష్టత కరువైందని ఆరోపించారు. డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ఆన్‌లైన్‌లో ఉంటుందా లేక ఆఫ్‌లైన్‌ విధానంలో ఉంటుందా అనే సమాచారం లేక విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారని, తక్షణమే దీనిపై స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో నాగసాయి, కౌశిక్‌, శ్రీను, శ్రీకాంత్‌ ఉన్నారు.

వృద్ధురాలు అదృశ్యం

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్‌): ఓ వృద్ధురాలు అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. వివరాలు.. నగరంలోని మల్లికార్జునపేట 2వలైనకు చెందిన అన్నపూర్ణకు 70 ఏళ్లు. వయస్సు రీత్యా మానసిక స్థితి సరిగా లేక చికిత్స పొందుతోంది. గత నెల 27న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఆచూకి తెలిసిన వారు అరండల్‌పేట పోలీస్‌ స్టేషన్‌ 0863–2231955, సీఐ ఆరోగ్య రాజు 8688831332 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వేధిస్తున్నారని వివాహిత ఫిర్యాదు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్‌): భర్త, అత్త, మామలు మరి కొందరి వేధింపులు తాళలేక ఓ వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. వివరాలు.. పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు గ్రామానికి చెందిన రామరాజు శ్రావణి, గుంటూరు వల్లూరివారితోట ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి నాగసుబ్రహ్మణ్యం 2024 నవంబర్‌ 16న పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి భర్త, అత్త, మామ, మరిదితో పాటు మరికొందరు తనను వేధింపులకు గురి చేస్తున్నారని శ్రావణి ఫిర్యాదులో పేర్కొంది.

హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని వినతి

నెహ్రూనగర్‌: గోరంట్లలో ఉన్న కాపు హాస్టల్‌ వద్ద రోడ్లు, స్ట్రీట్‌ లైట్లు, డ్రెయినేజీ వంటి ప్రాథమిక సదుపాయాలు కల్పించాలని తెలగ అభ్యుదయ సంఘ నాయకులు, ఏపీఐడీసీ చైర్మన్‌ ప్రభాకర్‌తో కలిసి నగర మేయర్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్‌లో ఇంటర్‌ నుంచి పీహెచ్‌డీ స్థాయి వరకు విద్యార్థులు ఉంటున్నారని, వీరితో పాటు చాలా మంది విద్యార్థులు ప్రొఫెనల్‌ కోర్సులు, పోటీ పరీక్షల కోసం సన్నద్ధమవుతున్న విద్యార్థులు కూడా ఉన్నారన్నారు. హాస్టల్‌ ప్రాంగణానికి, పరిసర ప్రాంతాలకు అవసరమైన ప్రాథమిక సదుపాయాలు లేకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మేయర్‌ రవీంద్ర

నెహ్రూనగర్‌: నగరం, అమరావతి రాజధానిలో భాగంగా ఉన్న దృష్ట్యా అభివృద్ధి పనులు శర వేగంగా నిర్వహిస్తున్నట్లు నగర మేయర్‌ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలో 18వ డివిజన్‌ రామనామక్షేత్రం 5వ లైన్‌లో రూ.93 లక్షలతో, 24వ డివిజన్‌లో పీకలవాగుపై రూ.28 లక్షలతో సిమెంట్‌ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులను నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మేయర్‌ మాట్లాడుతూ గుంటూరు నగరంలోని అన్ని వార్డులలో అభివృద్ధి పార్టీలకతీతంగా ప్రాధాన్య క్రమంలో పనులు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. దీనిలో భాగంగానే పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 18, 24 డివిజన్లలో రూ.1.21 కోట్లతో, స్థానిక ప్రజా ప్రతినిధుల ప్రతిపాదనలతో సీసీ రోడ్లు, డ్రైయిన్లు, కల్వర్టులను నిర్మించేందుకు శంకుస్థాపన చేశామన్నారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ స్థానిక కార్పొరేటర్ల అభిప్రాయాల మేరకు, వారు ప్రతిపాదించిన ప్రాంతాలలో ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు.

వైద్య వృత్తిలో ఎంతో ఆత్మ సంతృప్తి

జీజీహెచ్‌ డెప్యూటీ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఉమాజ్యోతి



మాట్లాడుతున్న డాక్టర్‌ ఉమాజ్యోతి

గుంటూరు ఎడ్యుకేషన్‌: వైద్య వృత్తితో లభించే సంతృప్తి ఎంతో ఆనందాన్ని ఇస్తుందని జీజీహెచ్‌ డెప్యూటీ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఎస్‌. ఉమాజ్యోతి అన్నారు. మంగళవారం డాక్టర్‌ బీసీ రాయ్‌ జయంతి సందర్భంగా చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్‌ క్యాంపస్‌తో పాటు భాష్యం మెడెక్స్‌, భాష్యం మెడి ఎయిమ్స్‌ క్యాంపస్‌లలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్‌ ఉమాజ్యోతి మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో డ్రగ్స్‌, మద్యపానం, ధూమపానానికి ప్రాముఖ్యతను ఇస్తున్నారని, ఫలితంగా యువత తప్పుదోవ పడే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్‌ యు.శ్రీనివాసరావు, జీజీహెచ్‌ న్యూరాలజీ విభాగం అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ గాజుల రామకృష్ణ మాట్లాడుతూ వైద్యవృత్తి ఎంతో పవిత్రమైనదని, జీవిత ప్రయాణంలో ఎదురయ్యే ఒడిదుడుకులను అధిగమించి ముందుకు వెళ్లిన వారే విజయవంతులవుతారని పేర్కొన్నారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్‌ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ వైద్యవృత్తిలో రాణిస్తూ ఎంతో అనుభవాన్ని గడించిన వైద్యులు వారి అనుభవాన్ని మీకోసం అందిస్తున్నారని, వారి జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలని జీవితంలో ఉన్నత విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాష్యం మెడెక్స్‌ ప్రిన్సిపాల్‌ హరిబాబు, భాష్యం విద్యాసంస్థల ముఖ్య సలహాదారు మైఖేల్‌ రాజ్‌, భాష్యం మెడెక్స్‌ పూర్వ విద్యార్థులు డాక్టర్‌ సీహెచ్‌ భార్గవి, డాక్టర్‌ కె.మానస, డాక్టర్‌ శివకైలాష్‌, డాక్టర్‌ గోపినాథ్‌, మంగళగిరి ఎయిమ్స్‌ వైద్య విద్యార్థి జి.శ్రీరామ్‌ పాల్గొన్నారు.

4న ధర్నా చౌక్‌లో మహాధర్నా

నెహ్రూనగర్‌: మున్సిపల్‌ ఇంజినీరింగ్‌ కార్మికుల జీతాలు పెంపుదల, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్‌ ఎంప్లాయీస్‌, వర్కర్స్‌ యూనియన్‌ (సీఐటీయూ అనుబంధం) ఇంజినీరింగ్‌ విభాగం జిల్లా కన్వీనర్‌ పూనేపల్లి శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్రవ్యాప్త నిరసనలలో భాగంగా గుంటూరు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 4వ తేదీన విజయవాడ ధర్నా చౌక్‌లో మున్సిపల్‌ ఇంజినీరింగ్‌ కార్మికుల మహాధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఓమెగాలో ఆధునిక క్యాన్సర్‌ వైద్య సేవలు

- ఏపీలో మొట్టమొదటిసారిగా ఫ్యాపీ పెట్‌స్కాన్‌
- లూటీషన్‌ థెరఫీ మొట్టమొదటిసారిగా ప్రారంభం



ఫ్యాపీ పెట్‌ స్కాన్‌ వద్ద డాక్టర్‌ ఎం.జి.నాగకిషోర్‌, డాక్టర్‌ శంకర్‌ మహదేవ్‌

గుంటూరు మెడికల్‌: అత్యంత క్లిష్టమైన క్యాన్సర్‌లను అతి సులువుగా గుర్తించి త్వరితగతిన చికిత్స అందించేందుకు ఒమెగా హాస్పిటల్స్‌(గుంటూరు) మొట్టమొదటిసారిగా అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈవిషయాన్ని మంగళవారం ఓ మెగా హాస్పిటల్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హాస్పిటల్‌ డైరెక్టర్‌, చీఫ్‌ సర్జికల్‌ అంకాలజిస్టు డాక్టర్‌ ఎం.జి.నాగకిషోర్‌ వివరాలు వెల్లడించారు. ఏపీలో మొట్టమొదటిసారిగా ఫ్యాపీ పెట్‌ స్కాన్‌ను గుంటూరు ఒమెగా హాస్పిటల్‌లో అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ ఫ్యాపీ పెట్‌స్కాన్‌ ద్వారా చాలా త్వరితగతిన క్యాన్సర్‌లను గుర్తించి నిర్ధారించవచ్చు అన్నారు. ప్రొస్టేట్‌ క్యాన్సర్‌, న్యూరో ఎండ్రోక్రైన్‌ ట్యూమర్స్‌ నివారణకు నూతన చికిత్సా విధానం సమర్థంగా పనిచేస్తుందని చెప్పారు. నూతన వైద్య పరికరం పనితీరు గురించి న్యూక్లియర్‌ మెడిసిన్‌ స్పెషలిస్టు డాక్టర్‌ శంకర్‌ మహదేవ్‌ వివరించారు.

వడ్డీ డబ్బులు ఇవ్వలేదని ఇంటికి తాళం!

పట్నంబజారు: అధిక వడ్డీ ఇవ్వాలని డిమాండ్‌ చేస్తూ ఓ కుటుంబానికి చెందిన ఇంటికి తాళం వేసిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు.. పాతగుంటూరులోని శివాలయం బజారులో గోపి అనే ఆటోడ్రైవర్‌ కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. అదే ప్రాంతానికి చెందిన కార్పొరేషన్‌ ఉద్యోగి రాంబాబు వద్ద గత కొంతకాలం క్రితం రూ.2.50 లక్షలు అప్పుగా తీసుకున్నారు. అయితే అప్పుకు సంబంధించి ప్రతినెలా డబ్బులు చెల్లిస్తున్నట్లు బాధితుడు తెలిపారు. ఇచ్చిన డబ్బులు సరిపోలేదంటూ రాంబాబు అసలుతో పాటు, వడ్డీ కలిపి రూ.7 లక్షలు చెల్లించాలని బాధితులను వేధింపులకు గురిచేస్తున్నట్లు ఆరోపిస్తున్నాడు. గత నెల రోజుల క్రితం బాధితుల నివాసానికి తాళం వేసి ఇంట్లోవారిని బయటకు పంపారు. బాధితులు దిక్కుతోచని పరిస్థితుల్లో బంధువుల నివాసంలో ఉంటున్నారు. గతనెల 30వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధిక వడ్డీతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని, పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై పాతగుంటూరు పోలీసు స్టేషన్‌ ఎస్‌హెచ్‌ఓ వెంకటప్రసాద్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందిన మాట వాస్తవమేనని, అయితే పూర్తి స్థాయిలో విచారిస్తున్నామని చెప్పారు. ఎలాంటి కేసు నమోదు చేయలేదని తెలిపారు. డబ్బులు అంశం కావడంతో వారిని బయట మాట్లాడుకోవాలని సూచించినట్లు పేర్కొన్నారు. బాధితులను ఇంటికి దౌర్జన్యంగా తాళం వేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

త్వరలో వెండింగ్‌ జోన్‌లు



నెహ్రూ నగర్‌: నగరంలో వీధి వ్యాపారుల కోసం వెండింగ్‌ జోన్‌లు త్వరలో ఏర్పాటు చేస్తామని నగర కమిషనర్‌ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం నగరంలో వెండింగ్‌ జోన్‌ల ఏర్పాటు చేసేందుకు వెండింగ్‌ జోన్‌ల కమిటీ సభ్యులతో కలసి నగరంలోని పట్టాభిపురం, కంకరగుంట, గుజ్జనగుండ్ల, జె.కె.సి. కాలేజి రోడ్డు, ఆర్టీఓ ఆఫీస్‌ రోడ్డు తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ మాట్లాడుతూ నగరంలో వీధి వ్యాపారుల గుర్తింపు ప్రక్రియ పూర్తికావచ్చిందని, త్వరలోనే గుర్తించిన వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డుల జారీ చేసి వెండింగ్‌ జోన్‌లలో స్థలాలను కేటాయిస్తామన్నారు. పర్యటనలో వెండింగ్‌ జోన్ల కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్‌, బొడ్డుపల్లి స్మిత పద్మజ, సంకూరి శ్రీనివాసరావు, షేక్‌ మీరవలి, ట్రాఫిక్‌ సీఐ సింగయ్య, సిటీ ప్లానర్‌ రాంబాబు, ఈ.ఈ. సుందర రామి రెడ్డి, స్ట్రీట్‌ వెండర్స్‌ తలార్‌, నరసింహారావు, ఉపా సెల్‌ పీడీ రామారావు పాల్గొన్నారు.